



## రువాండాలో మార్‌బర్గ్ వైరస్‌తో 15 మంది మృతి

న్యూఢిల్లీ: రువాండా సహా 17 దేశాల్లో మార్‌బర్గ్ వైరస్ అలజడి రేపుతున్నది. ఈ వైరస్ సోకడంతో ఇప్పటికే రువాండాలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. వందలాది మందికి ఈ వైరస్ సోకినట్లు అంచనా. మార్‌బర్గ్ వైరస్ వల్ల వైరల్ హెమరేజిక్ ఫీవర్ వస్తుంది. కొన్నిసార్లు రక్త నాళాలను దెబ్బతీస్తుంది. ఫలితంగా రక్తం స్రవిస్తుంది. గబ్బిలాల నుంచి మానవులకు ఈ వైరస్ సోకుతుంది. ఈ వైరస్ సోకినవారి రక్తం, లాలాజలం, మూత్రం ద్వారా ఇతరులకు వ్యాపిస్తుంది. ఈ వ్యాధితో బాధపడేవారికి తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, వాంతులు, అతిసార వస్తాయి. ఇది తీవ్ర స్థాయికి చేరినపుడు శరీరం లోపలి భాగాల్లోనే రక్తం స్రవిస్తుంది. అవయవాలు పని చేయడం మానేస్తాయి. చివరికి రోగి మరణానికి దారి తీయవచ్చు. రువాండా సహా ఇతర దేశాలకు వెళ్లాలనుకునేవారు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులు సూచించారు.

## నేడు నికేశ్ బినామీల లాకర్లు తెలుస్తం

- నవంబర్‌లో 17 ట్రాప్‌లు, 1 అక్రమాస్తుల కేసు
- ముగ్గురికి జైలు శిక్ష, జరిమానాల విధింపు: ఏసీబీ డీజీ



హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఏసీబీ చరిత్రలోనే రెండో అతిపెద్ద కేసుగా పరిగణిస్తున్న హెరూర్ నికేశ్‌కుమార్ ఆస్తులపై అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నికేశ్‌కుమార్ బినామీల బ్యాంకు లాకర్లను ఇవాళ తెరుస్తారని సమాచారం. సోమవారమే లాకర్లను తెరవాలని భావించినప్పటికీ మంగళవారానికి వాయిదా వేసినట్టు ఏసీబీ వర్గాలు తెలిపాయి. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఏసీబీ.. నికేశ్‌తో సంబంధం ఉన్న వ్యక్తులను కూడా విచారించి, అరెస్టు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిసింది. ఏసీబీ నవంబర్‌లో 17 ట్రాప్‌లతో పాటు ఆదాయానికి మించిన ఓ కేసును నమోదు చేసింది. 17 ట్రాప్‌లలో 27 ప్రభుత్వ ఉద్యోగులు, ముగ్గురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిందితులను రిమాండ్ చేసినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులెవరైనా లంచాల కోసం వేధిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేయాలని, ఎక్స్‌లో (twitter @TelanganaACB), ఫేస్‌బుక్‌లో (@telanganaacb) ప్లాట్‌ఫామ్‌లలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## రేపే 'డీట్' ప్రారంభం

### కంపెనీలకు, నిరుద్యోగులకు మధ్య వారధి

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో అబిడ్స్‌లోని పరిశ్రమల శాఖ కార్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన 'డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ' (డీట్)ను సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ప్రారంభించనున్నారు. వివిధ కంపెనీలు కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలు, అప్రెంటీస్‌షిప్, ఇంటర్న్‌షిప్‌ల వివరాలను ఈ వెబ్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులతోపాటు డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో ఉన్న విద్యార్థులు ఈ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో నమోదైన అభ్యర్థులకు కంపెనీలు తమ అవసరాలకు తగ్గట్టుగా ఉపాధి అవకాశాలు కల్పిస్తాయి. అభ్యర్థులకు కంపెనీలే నేరుగా మెసేజ్‌లు, ఈ-మెయిల్స్ పంపడంతోపాటు కాల్‌చేసి పిలుస్తాయి. 'డీట్' అనేది కంపెనీలకు, ఉద్యోగార్థులకు మధ్య వారధి లాంటిదని, ఇందులో తమ ప్రమేయం ఏమీ ఉండదని అధికారులు స్పష్టం చేశారు. 'డీట్'లో కనీసం 20 లక్షల మంది అభ్యర్థులను నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులకు 'డీట్' ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు.

## కార్యకర్తలకు అండగా ఉంటాం

- కంటికి రెప్పలా కాపాడుకుంటాం
- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత
- బాధిత కుటుంబానికి రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న జడ్పీ మాజీ అధ్యక్షురాలు దావ వసంత

జగిత్యాల, డిసెంబర్ 2: కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, కంటికిరెప్పలా కాపాడుకుంటామని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత భరోసా ఇచ్చారు. రూరల్ మండలం గుల్లపేట గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త మేడపట్ల లక్ష్మణ్ ప్రమాదవశాత్తూ ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. లక్ష్మణ్‌కు పార్టీ సభ్యత్వ ప్రమాద బీమా ఉండడంతో బీమా సొమ్ము రూ.2లక్షల విలువైన చెక్కును సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు ఆమె అందజేశారు. పార్టీకి కార్యకర్తలే కన్న బిడ్డలు అని, ఏ కష్టం వచ్చినా ఆదుకుంటామని చెప్పారు. ఇక్కడ రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు ఆనందరావు, గుల్లపేట్ మాజీ సర్పంచ్ తిరుపతి, మాజీ ఎంపీటీసీ సురేందర్ రెడ్డి, రూరల్ మండలం నాయకులు గంగారెడ్డి, దావ సురేశ్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆనందరావు, నాయకులు చింత గంగాధర్, మ్యకల పవన్ ఉన్నారు.

## భగవద్గీత పోటీల్లో బ్లూబెల్స్ విద్యార్థుల ప్రతిభ

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 2 : కరీంనగరంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి భగవద్గీత కంఠస్థ పోటీల్లో హనుమాన్‌నగర్ బ్లూ బెల్స్ పాఠశాల విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలిచారని పాఠశాల ప్రిన్సిపాల్ జంగా సునీతామనోహర్ రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులను అభినందించి మాట్లాడారు. పోటీల్లో కే వేదాన్షిక, టి. హర్షిని, ఆర్ శ్రీ శాన్వి, ఈ స్నితిక ప్రథమ, ఎం శాన్విక, పి. హర్షిత్ ద్వితీయ, సీహెచ్ రిషిక్, టి. రశ్మిత తృతీయ స్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. ప్రథమ స్థానంలో గెలుపొందిన విద్యార్థులు ఈ నెల 15న కడప జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి భగవద్గీత పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

## గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

వీణవంక, డిసెంబర్ 2: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఫిజికల్ సైన్స్ బోధించడానికి గెస్ట్ టీచర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేకాధికారి సునీత ప్రకటనలో పేర్కొన్నారు. బీఎస్సీ, బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులని, జీతం రూ.18 వేలు ఉంటుందని తెలిపారు.

## ఎన్నారైల ఔదార్యం.. పేద పిల్లలకు సైకిళ్లు




పంపిణీ చేసిన సైకిళ్లతో విద్యార్థులు

ధర్మపురి,డిసెంబర్ 2: ఆస్ట్రేలియాలో ఉంటున్న జగిత్యాలకు చెందిన వసుదేవ కుటుంబానికి చెందిన ఎన్నారైలు ఔదార్యం చూపారు. పేద విద్యార్థులకు సాయం చేయాలని భావించి జగిత్యాలకు చెందిన సామ ఉమాపతిని సంప్రదించారు. ఆయన సూచన మేరకు సైకిళ్ల పంపిణీకి అవసరమైన డబ్బులు పంపించారు. ఈ క్రమంలో ఉమాపతి సైకిళ్లను కొనుగోలు చేశారు. సోమవారం ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రమేశ్‌తో కలిసి ధర్మపురి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు.

## రైతు రాంచంద్రారెడ్డికి జాతీయ పురస్కారం

రామడుగు, డిసెంబర్ 2 : లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన రైతు ద్యావ రాంచంద్రారెడ్డి సోమవారం దేశ రాజధాని ఢిల్లీలో మిలియనీర్ ఫార్మర్ పురస్కారాన్ని అందుకున్నారు. రాంచంద్రారెడ్డి కొన్నేండ్లుగా కొత్తరకం పంటలను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గతంలో ఓసారి జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. తాజాగా, సోమవారం ఢిల్లీలోని పూసాలో నిర్వహిస్తున్న కిసాన్ మేళాలో జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ, వ్యవసాయ మాసపత్రిక కృషి జాగరణ్ సంయుక్త ఆధ్వర్యంలో రాంచంద్రారెడ్డికి అవార్డు ప్రదానం చేశారు.

## విద్యార్థులు లక్ష్యంతో చదవాలి



మాట్లాడుతున్న సీఐ సురేష్‌బాబు

మేడిపల్లి, డిసెంబర్ 2: విద్యార్థులు ఒక లక్ష్యంతో చదివి కనీపెంచిన తల్లిదండ్రులకు, విద్య నేర్పిన గురువులకు మంచి పేరు తీసుకరావాలని కోరుట్ల సీఐ సురేష్‌బాబు సూచించారు. ప్రహరీ క్లబ్‌లో భాగంగా సోమవారం కొండాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించి, మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థులకు దూరంగా ఉండాలని, సెల్‌ఫోన్ వాడొద్దని సూచించారు. అనంతరం జీసీఈసీ క్లబ్, హెల్ప్ డెస్క్‌ను ప్రారంభించారు. అనంతరం కోరుట్ల సీఐ సురేష్‌బాబు, మేడిపల్లి ఎస్ఐ శ్యామ్‌రాజ్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు. ఇక్కడ ఇన్‌చార్జి హెచ్‌ఎం సుధాకర్, క్లబ్ వీసీ మెంబర్, టీచర్లు మల్హాల్‌రావు, రుక్సానా, సదాలక్ష్మి, సుమలత, నవ్య, మనోహర్, రాజేంధర్‌రెడ్డి, రాజేంధర్, చంద్రప్రకాశ్, నర్సయ్య, నరేష్, పవన్, దయాకర్, నాయకులు సురేందర్ ఉన్నారు.


## చిట్టాపూర్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ

మల్లాపూర్, డిసెంబర్ 2: చిట్టాపూర్‌లో బుక్క రాజేశం ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రాజేశం వృత్తిరీత్యా పూజారి కావడంలో మూడు రోజుల క్రితం తన ఇంటికి తాళం వేసి వరంగల్‌కు వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడంతో పక్కింటివారు గమనించి, రాజేశంతోపాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంట్లో ఉన్న రూ.10 వేల నగదు పోయిందని రాజేశం తెలిపారు. సీఐ నిరంజన్‌రెడ్డి, క్లూస్ టీం సభ్యులు ఘటనా స్థలాన్ని పరిశీలించగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

**ఆంజనేయ స్వామి ఆలయంలో..**

కోరుట్ల, డిసెంబర్ 2: పట్టణ శివారు అయోధ్య పట్నంలోని ఆంజనేయస్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి హుండీని పగులగొట్టారు. భక్తులు కానుకగా సమర్పించిన రూ.20 వేల నగదును ఎత్తుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా అయ్యప్పస్వామి పల్లకీ సేవ



కుస్తాపూర్‌లో అయ్యప్పస్వామి సేవ సమితి ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్పస్వామి పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లారు. – మల్లాపూర్, డిసెంబర్ 2